# ప్రమోషన్

'మల్టీ పర్పస్ హైస్కూల్ రోడ్డు వెంట సూటిగా పోతే ఆ దారి జిల్లా జైలుదాకా పోతుంది" అని తన బంధువులను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన వో కుటుంబానికి చెబుతున్నాడు రామనాధం.

జైలు నాలుగు గోడలకి, నిన్నటి వరకు తానున్న నాలుగు గోడల మధ్యకీ అంత పెద్ద తేడా లేదు. అక్కడా ఇక్కడా అధికార దర్పం, ఔద్ధత్యం వొకే తీరుగా వున్నాయి.

ఆఫీసులలో రికార్డు రూములాగా, జైలు కూడా ఒక ఆఫీసులో అంతర్భాగమే. రికార్డు రూములో పనికిరాని ఫైళ్ళను పారేస్తారు. నేటి యీ సంఘానికి పనికిరారనుకున్న మనుషులను జైల్లో పారేస్తారు. ఇంతే తేడా.

ఇన్నాళ్ళు ఫైల్సులో తానొక ఫైలుగా మసులుతూ బతుకు వెళ్ళదీశాడు. ఫైళ్ళు తనను సృష్టించాయో, లేక తానే ఫైళ్ళను సృష్టించాడో తెలియనంత మమేకం అయిపోయాడు. అద్వైత సిద్ధి పొందినంత పనయింది.అసలు ఫైళ్ళకున్నవిలువ మనుషులకుందా అన్న అనుమానం కొత్తగా మొలకెత్తుతోంది. నిన్నటిదాకా రామనాధం వున్న ప్రపంచం వేరు. నేడు మరో ప్రపంచంలో కాలు పెట్టినట్లుగా అనుభూతిని పొందుతున్నాడు.

అది ఏప్రిల్ 10 వ తారీఖు. ఎన్. జి. వోలు సమ్మె నోటీసిచ్చారు. కేంద్రంతోపాటు, తనకు గూడా తాత్కాలిక సహాయం తరుగుదల లేకుండా పెరిగిపోతూవుండే ధరలను, నియంత్రణ చెయ్యాలని అంటున్నారు. అది యీ సోషలిజంలో సాధ్యమవుతుందో కాదో అని ఆటోమాటిక్‌గా ధరలతో బాటు, పెరిగే కరువుభత్యం ఏర్పాటు చేయమంటున్నారు. అంతా వొక్కటిగా నిలిచారు. ఈసారి మాత్రం ప్రాంతీయ భేదాలు పాలకవర్గానికి

అక్కరకు రాలేదు. కనుక ప్రణాళికలను, బలహీన వర్గాలను అడ్డం పెట్టుకో చూస్తున్నారు.

"మిస్టర్ రామనాధం"

ఎన్నడూలేని ఆప్యాయతనూ, ప్రేమనూ వొలకబోస్తూ పిలిచాడు ఆఫీసరు. చెట్టంత మనిషి తనసీటు కెదురుగా నిలబడివున్నాడు. ఇంతకు ముందు "ఏయ్ రామనాధం" అనీ,వొకోసారి అరే తురే అనీ అర్థం వచ్చే టట్లుగా పిలిచే ఆఫీసరుగారేనా ఈమనిషి అని అనిపించింది. విస్తుపోయాడు. ఇంకా తేరుకోక ముందే రామనాధాన్ని ఉద్దేశించి :

"ఇటు చూడండి చేంబరుదాకా వస్తారా"

"చిత్తం ఎస్సార్" అలవాటు ప్రకారముగాక యింకోసారిఎక్కువే చిత్తం అని అనేశాడు.

తన సీటు కెదురుగా నిలుచున్న ఆఫీసరును చూచి మాచెడ్డ యిబ్బందిలో పడిపోయాడు. ఇంత అనుగ్రహం భరించ లేనన్నట్లుగా మొహం పెట్టాడు.

ఆఫీసులో తనసీటు అన్నిటికన్నా పనికిరాని సీటు. టేబుల్ మీద నుండిగాని క్రిందినుండి గాని ఆదాయం రావడానికి ఆస్కారంలేని సీటు.

ఈ సీటు కామధేనువుగాదు, కల్పవృక్షమూకాదు. దీనిమీద ఎవడి కన్నూ పడదు, పడలేదు, పడబోదు. కొన్ని నెలలకోసారి జరిగే సీట్ల మార్పిడిలో ఆ వేలంపాటలో ఈ సీటు ఎజండాలో వుండనే వుండదు.

చేంబరులోకి పిలవడమంటే ఏదో గొప్ప విశేషమే.

చేంబరంటే ఆఫీసరనే శేషశాయి ఆవాసం.

దేవుడి గర్భగుడిలాంటిది.

తిరపతి వెంకన్న స్పెషల్ దర్శనం లాంటిది.

అందులో కొద్దిమందికే ప్రవేశార్హత.

అది ఆగ్రహానుగ్రహాలకు పంపిణీ కేంద్రం.

మంచీ-చెడూ ఏదైనా జరగొచ్చు.

ఆలోచిస్తూ ఎదురుగా కనపడుతున్న గోడమీద ఎలక్షన్ గుర్తుల వైపు చూస్తున్నాడు.

ఆవు దూడలూ, కంకి కొడవళ్ళూ, ముసలమ్మ చెరకాలూ, దీపాలూ, పారలూ, వగైరా వగైరా

భూగోళంలా, కళ్ళముందు గిరగిరా తిరుగుతున్నాయి. మొన్న మొన్ననే శుభాలు పూస్తాయనే విశ్వాసానికి, ఆశ్వాసమిచ్చాయి.

"రామనాథం గారూ, మిమ్మల్నే" అన్న ఆఫీసరు కేక మళ్ళీ యీ భూలోకంలోకి తెచ్చిపడేసింది.

ఆవు వెంట దూడలా అనుసరించాడు.

మార్చిపోయిన మార్చి నెలను నెమరేసుకుంటున్నాడు.

చేంబరుదిక్కు పోతుంటే తోటివాళ్ళు తనను విచిత్రంగా విచిత్ర జంతువులాగా చూచారు. ఆ చూపుల్లో అవహేళన, వెటకారం, అన్నీ రంగరించి నట్టుగా వున్నాయి.

ఈ భూప్రపంచంలో జీవి వొంటివాడు. వొక్కడే వచ్చాడు.వొక్కడే పోతాడు. పోయేనాడు భార్యాబిడ్డలూ, బంధుమిత్రులూ ఎవళ్ళూ వెంటరారు. ఎవడికెవడు కనక. ప్రతి మానవుడు తన మోక్షానికి తానే ప్రయత్నించాలి. తరించాలి. ఇదే జీవుడి విధి, కర్తవ్యము, మొన్నటి గీతాసప్తాహం స్వాములవారి వేదాంతోపన్యాసము చెవుల్లో గింగురుమంటున్నది. తాను తరించడానికిదే మార్గమేమో ? భగవంతుడి లీలలు అర్థము చేసుకోలేము అనుకుంటూ చేంబరులోకి చేరుకున్నాడు.

"మిస్టర్ రామనాథం, జమాబంది సెక్షను హాండిల్ చేయగలరా ?"

"రెవెన్యూ టెస్టులో పాసయ్యాను సార్. ఎందుకు చెయ్యలేను సార్."

"తక్కావీ సెక్షనా, ఆబ్కారీ సెక్షనా? ఏదయితే మీకు సౌకర్యం?"

ఆ పలుకులు తేనె లొలుకుతున్నాయి, అమృతం కురుస్తున్నట్టుగా వుంది. హృదయ వీణలోని మధురమైన తంత్రులు మీటుతున్నట్టుగా వున్నాయి. ఉత్సాహంతో ఉక్కిరిబిక్కిరిగా వుంది. రోమాంటిక్ భావనలన్నీ కట్టగట్టుకొని దండెత్తినట్టుగా అనుభూతిని పొందాడు. నోటమాట రాక ఎంతో ప్రయత్నంమీద "మీ దయ సార్" అన్నాడు. ఉద్వేగంతో గొంతు పూడుకుపోయింది.

రేపు ఆఫీసు ఆర్డరు వేస్తాను మమ్మల్ని మరిచేరు సుమా."

"ఎంత మాట సార్, నేనూ తమరిని సంతోషపెట్టు కుంటాను."

బంగారు కలలు నెమరేసుకుంటున్నాడు.

పట్టనున్న మహర్దశను ఊహించుకుంటున్నాడు. తన ప్రమోషను కొట్టేసిన కాకారాయళ్లకు, నాలుగు తరాలకు సంపాయించి పడేసుకున్న నలుగురితోపాటు నారాయణగాళ్లకూ, తాను గట్టిపాఠం చెప్పబోతున్నాడు.

మిటమిటలాడే ఎండలతోబాటు, ఏప్రిల్ 12వ తారీఖు రానే వచ్చింది. వ్యష్టిగా భయపడేవాడు, సమిష్టిలో ధైర్యాన్ని పంచుకున్నాడు, పుంజుకున్నాడు. సమ్మె చేశారు. పదిమందితో చావు పెండ్లితో సమానమని వూరికేనే అన్నారా అనుభవజ్ఞులు.

కోరుతున్న కోర్కెలు సమిష్టిగా సంఘబలంతో సాధించుకోవాల్సినవి, వ్యష్టిగా సిద్ధించేవికావు, ఎవడి స్వార్థం వాడు చూచుకోవాలనే వ్యక్తి స్వార్థపు వేదాంతానికి యిది చుక్కెదురు. వ్యష్టికన్న సమిష్టిమిన్న అని జీవితసత్యం బోధిస్తున్నది. కేంద్రం యిచ్చే కరువుభత్యం కావాలని కోరినపుడు, అంతా అసంభవమనిపించింది, చందమామ కావాలని కోరినట్లే అనిపించింది. కాని అసంభవాన్నే సంభవం చేశాయి పరిస్థితులు.

* * * *

ఆనాడు కాఫీ తాగకముందే ఆఫీసరుగారు జీపుతో రామనాధం యింటిముందు ప్రత్యక్షమయ్యాడు. "మిస్టర్ రామనాధం, పికెటింగ్ మొదలుగాకముందే మనము ఆఫీసుకు వెళ్ళాలి."

కూచోబెట్టి కాఫీ యివ్వడానికైనా తన యింట్లో మంచి కుర్చీలేదు. కుచేలుడి గృహానికి కృష్ణుడు వచ్చినట్లుగా వుంది. కస్సుమంటాడేమోనన్న భయం కాఫీ తాగండి సార్ అనికూడా అననీయలేదు.

తానుగూడా కాఫీ తాగకుండానే ఆఫీసు దారి పట్టాడు.

ఆఫీసంతా నిర్మానుష్యంగా వుంది.

ఫ్యాక్టరీలో పోగుపడే చెత్తాచెదారంలాగా, ఆఫీసులో చింపేసిన చిత్తుకాగితాల సయ్యాటలు రెపరెపమంటున్నాయి. గాలి కెగురుతున్నాయి. సమ్మె చేశాడు గాబోలు వూడ్చేవాడు గూడా రాలేదు. అరణ్యంలా వుంది. చెడు నక్షత్రంలో ప్రాణంపోతే విడిచేసిన కొంపలా వుంది.

"మిస్టర్ రామనాధం యిటు చూడండి."

"యస్సార్" అన్నాడు.

ఆఫీసరుగారి చూపులు చూస్తే యిదంతా శుభ్రము చేయ మనడుగదా కొంపదీసి, అని మనసులో గుంజాటన పడుతున్నాడు.

"నీకూ నాకూ ప్రమోషను తప్పదోయ్."

అమ్మయ్య రక్షించాడు, అనుకొన్న రామనాధం,

"యెందుకు సార్" అన్నాడు.

"జిల్లా మొత్తంలో ఆఫీసులో పని చేయించింది మనమేనోయ్. హైద్రాబాదుకు వైర్‌లెస్ పోయింది. మన పేరు యివాళ రేడియోలో మోగిపోతుంది."

"అలాగా సార్ !" తెరిచిన నోరు తెరిచినట్లుగానే వుండిపోయింది. భారతరత్న, పద్మవిభూషణ బిరుదు ప్రదానమైనంత సంతోషం పట్టలేక పోతున్నాడు.

పికెటింగ్ చేసేవారు ఆఫీసు ముందుకు వచ్చారు. గేటుముందు బైఠాయించారు. తనను రమ్మంటున్నారు. పోలీసులొచ్చారు, వాళ్ళను లాక్కెళ్ళారు. మొరాయించినవాళ్ళను నాలుగు బజాయించారు.

అన్ని సెక్షన్ల పనీ తన నెత్తినపడింది. నడుములు తింగుమనేదాకా వ్రాశాడు, వ్రాస్తున్నాడు. ఎంతమంది చేసినా, ఎన్నాళ్ళు చేసినా, ఎంతకూ తెగేపనికాదు. తరాతరాలుగా సాగేపని, సాగుతున్న పని, సాగబోయే పని. వ్రాసి వ్రాసి కలం దానంతటదే జారిపోయింది. కుర్చీలోనే కాళ్ళు బార జాపి వొళ్ళు విరుచుకొన్నాడు.

"రామనాధం! ఈ పిరియాడికల్ స్టేటుమెంట్సు యివ్వాళ పంపించాలోయ్. సెక్రటేరియటువాళ్ళు శతకోటి రిమైండర్‌లు వ్రాస్తున్నారు. నా ప్రమోషన్ ఆపుతామంటున్నారు బోర్డువాళ్ళు."

ఓ యాభయి కాయితాలు నెత్తినేశాడు. ఈ పని తలుచుకొనే సరికి ప్రమోషన్ సంగతి దేవుడెరుగు, ప్రాణాలు పోయేటట్లుగా వుంది రామనాధానికి. కొన్ని కాయితాలు ఆఫీసరుగారు తానురాస్తే సరిపోయేది. పని సులువయేది. అలా ఎందుకు వ్రాస్తాడు, ఆయనకు నామర్దాగాదూ. గ్రీకు బానిసలతో పనిచేయించే వోవర్‌సీర్ లాగా, ఫ్యాక్టరీ కంట్రాక్టు లేబర్ మేస్త్రీలాగా, ఖైదీలతో పనిచేయించే హెడ్‌వార్డన్‌లాగా కుర్చీలో కూర్చొని పనులు పురమాయిస్తున్నాడు. చేయలేక తాను సతమతమవుతున్నాడు. తలప్రాణం తోకకువస్తున్నది. ఇదంతా ఆఫీసరుకేమి పట్టింది. ఎద్దు పుండు కాకికేమి ముద్దు? పని కాలేదని విసుక్కుంటున్నాడు. కోపగించుకుంటున్నాడు. మొదటిరోజే యిలావుంది ముందుముందెలా వుంటుందో! కోపాన్నీ, విసుగునూ, ప్రదర్శించడానికి తానొక్కడే కేంద్రమయిపోయాడు. ఆఫీసునిండా జనముంటే అది వికేంద్రీకరణమయ్యేది.

అన్నానికి యింటికెళ్ళాలని లేచాడు "ఇంటికిపోతే నిన్నెవడు రానిస్తాడోయ్, హోటల్ నుండి కారియర్ తెప్పిస్తాను, యిక్కడే వుండు" అన్నాడు ఆఫీసరుగారు. తాను మాత్రం ఇంటికెళ్ళి భోజనం చేసివచ్చాడు. రాత్రయినా యింటికి పోనివ్వలేదు. పోలీసులతో యింటినుండి పక్కబట్టలు తెప్పించాడు. ఆఫీసులో ఎటెళ్ళినా పోలీసులు ప్రత్యక్షం.

ఆఫీసొక జైలులా వుంది – ఆఫీసర్ జైలు సూపర్నెంటుగా వున్నాడు. పోలీసులు వార్డర్‌గా కనిపిస్తున్నారు.

C. P. BROWN
MEMORIAL LIBRARY

భరించరాని బలవంతపు చాకిరీ నుండి బయటపడాలి. ఆదాయం ఆశలు కోరికల గుర్రాలను పరుగెత్తించడానికో జీవనం ఆఫీసుకు వస్తే గద్దా.

కులం చెడ్డా సుఖం దక్కలేదు.

పెళ్ళాం బిడ్డలను కూడా చూడ నోచుకోలేని బతుకై పోయింది. ఆఫీసే సర్వ ప్రపంచం, హోటలు మెతుకులే ప్రాణాధారం.

పంజరంలో చిక్కిన చిలుక విలవిలలాడుతోంది. ఏప్రిల్ నెల పూర్తయింది.

హోటల్ బిల్సు మినహాయించుకోగా వచ్చిన జీతంరాళ్ళు చేతిలో పడ్డాయి.

"సమ్మెలో చేరితే యీ సదుపాయం ఉండేదా మిస్టర్" అన్నట్లుగా ఆఫీసరు చూశాడు.

ఈ వేరు సంసారం హోటల్ బిల్సుతో జరిగిన అన్యాయం, అదనపు భారం, ఆఫీసరుగారి దివ్యచిత్తానికి వచ్చినట్లులేదు. ఆరుగురు చెయ్యాల్సిన పని అడ్డగాడిదలా తనొక్కడే చేశాడు. హోటల్ బిల్సే తనకు వచ్చిన ప్రతిఫలం. గుండెపగిలిన భార్యాపిల్లలు తన మనోనేత్రం ముందు కనబడుతున్నారు. తలచుకుంటేనే గుండె బేజారవుతుంది. ఆఫీసరు అనుగ్రహం తనను ఎన్నాళ్ళు కాపాడుతుంది? నీళ్ళలో నుండి బయటపడేసిన చేపలా వుంది తన పరిస్థితి. యిదో కృత్రిమ ప్రపంచం, పోలీసు యినుప తెరల ప్రపంచం. జైలుకన్నా ఛండాలమైన జైలులాంటి ఆఫీసు. చీలికలు పెట్టే యీ బూటక నాటకంలో తానొక ప్రధాన పాత్ర ధారి. తలచుకుంటేనే అసహ్యం వేస్తుంది. అందరికళ్ళూ తనమీదే వున్నట్లున్నాయి. వెలివేసినట్లుగా చూస్తారు. దీనికన్నా సమ్మెలో చేరితేనే హాయిగా వుండేది. ఏమి సుఖం బావుకుంటున్నాను. మానసిక బాధైనా తప్పేది. తన స్థానం తనవాళ్ళలోనే వుంది. ఈ ఆఫీసరూ పోలీసుల మధ్య తనకు స్థానం లేనేలేదు. మందలో వుంటేనే గొర్రెకు రక్షణ. తోడేళ్ళ గుంపులో రక్షణ వుంటుందనుకున్నట్లుగా వుంది తన వ్యవహారం.

తాను తొందరపడ్డాడేమో ! పొరపడ్డాడేమో ? ఇలా భావపరంపర సాగుతోంది.

ఆఫీసరు ఏదో పిలుస్తున్నాడు కాని తనకు వినపడడం లేదు. వినే పరిస్థితిలో గూడా లేడు.

నినాదాలు వినవస్తున్నాయి. యూనియన్ వూరేగింపు కాబోలు వస్తున్నది. వున్నట్టుండి ఊరేగింపు ఆఫీసు లోపలికి తోసుకు వచ్చింది. ఆ ఊరేగింపు సంఘ విద్రోహం మీద దాడిచేసే సైన్యంలా వుంది. పోలీసుల విజిల్సు-లారీల-లాఠీల లాస్యం, వూరేగింపును తరిమికొట్టే ప్రయత్నాలు-సినిమా రీళ్ళలా కళ్ళముందు చకచకా సాగిపోతున్నాయి.

చిక్కని పక్షికోసం, పొంచి కూచున్న వేటగాడిలా ఆఫీసరు తననే కనిపెడుతున్నాడు.

"ఏం భయంలేదు మిస్టర్ రామనాధం .పోలీసులున్నారు. తుపాకి స్క్వాడ్‌కు ఫోన్ చేశాను అంటున్నాడు ఆఫీసరు. జరగబోయే తనవాళ్ళ రక్తపాతాన్ని చూపి ధైర్యం చెపుతున్నాడు.

రామనాధం తన సీట్లో నుండి హఠాత్తుగా లేచాడు. వెయ్యి మైళ్ళ వేగంతో మెరుపులా పరిగెత్తాడు. ఊరేగింపులో కలిశాడు. తప్పిపోయిన బిడ్డ తల్లితో కలిసినట్లుగా మారిపోయింది వాతావరణం. "యూనియన్ జిందాబాద్" అను నినాదాలు దిక్కులు పిక్కటిల్లాయి. ఎడబాసిన బిడ్డను, ఎత్తి ముద్దు పెట్టుకొని హత్తుకున్న అనుభూతిని పొందింది ఊరేగింపు. అదే అనుభూతితో ప్రవాహంలాగా ముందుకు సాగింది.

(1971)